# కనువిప్పు

కథానిక

రమణ అయిదు నిముషాలనుంచి గమనిస్తున్నాడు. ఆడవాళ్ళ వరసలోవున్న ఆవిడెందుకో తనకేసి తదేక దీక్షతో చూస్తోంది. అతనోమాటు ముందుకు తన దృష్టిని సారించాడు. పూజారి తనదగ్గరకు రావటానికి ఇంకా రెండు నిమిషాలు పడుతుంది. ప్రసాదం అందుకోటానికి అందరూ క్యూలో నిలబడ్డారు. తన భక్తుల క్రమశిక్షణకు గర్భగుడిలోంచి దేవుడు గర్వంగా నవ్వాడు.

ఆమెకు యాభై యేళ్ళు వుంటాయి. తల బాగా పండిపోయింది. జీవితంలో ఎక్కువ కష్టాలకు గురైనవాళ్లు త్వరగా వృద్ధులవుతారు. అందుచేత ఆమె వయసు విషయంలో తన నిర్ణయం తప్పవొచ్చు. మెడలో నగా-నట్రా లేదు. అతి సామాన్యంగావుంది. ఎక్కడో చూసినట్టనిపించింది. ఒకవేళ ఆమె మరొకరివంక చూస్తుంటే తన వొంకేనని పొరబడుతున్నాడేమో! ఆమె వెనకాలున్న అమ్మాయికూడా అతనికేసి రెండుమూడు సారులు చూసింది.

చేతిలో అవగింజంత చక్కెర పొంగలి పడగానే అతను కళ్ళకద్దుకుని ఆరగించి సింహద్వారం దగ్గరకు వచ్చాడు. ఆ రెండు జతల కళ్ళూ తన్నింకా వెంటాడిస్తూనే వున్నాయి. ప్రసాదం అందుకున్న తరవాత వాళ్ళుకూడా అతని దగ్గరకు వచ్చారు. రమణకీమాటు ఆ అమ్మాయిని బాగా చూసే అవకాశం కలిగింది. నగలేవీ లేవు. ఆకుపచ్చరాయి వున్న ముక్కుపుడక మాత్రంవుంది. మొహం పైభాగం మాత్రం వంకరపోయిన వృత్తంలా వుంది. ఆ అమ్మాయిని చూస్తున్నంత సేపూ అతనికి మతిపోతున్న దనిపించింది. ఆమె అందం చూసికాదు. 'ఈ అమ్మాయి నెక్కడ చూశాను చెప్మా!' అనే ప్రశ్నతో.

"నాయనా! ... ఓ మాటడుగుతాను. ఏమీ అనుకోకు. నిన్నెక్కడో చూసినట్టుగా వుంది. అందుకని-మీ నాన్నగారి పేరేమిటి? మీదేవూరు!" అనడిగిందావిడ. అతను చెప్పాడు. కొంతసేపు ఆవిడట్లాగే నోరు తెరచి చూస్తూ వుండిపోయింది. ఆమె ఆశ్చర్యం తీరేదాకా అతనా అమ్మాయి పొడుగాటి జడవంక చూస్తూ నిలబడ్డాడు.

"నేను గుర్తున్నానా?"

ఆమెను గుర్తుపట్టటానికి విఫల దృక్కులు సారించి "లేదండీ! నాకెక్కడో చూసినట్టుంది" అన్నాడు.

"నేను మీ అత్తయ్యను. నువ్వు ఎంత పెద్దవాడివయ్యావు!...అవును. చూసి ఎనిమిదేళ్ళు దాటి వుంటుంది. ఇప్పుడిక్కడే వుంటున్నావన్నమాట. ఇది సుశీల-జ్ఞాపకం వుందీ!"

"అరె!...సుశీల!...ఎంతలో ఎదిగిపోయింది! వేలెడు జడ-" అంటూ జ్ఞాపకం వాచ్చినవాడిలా ఎటో చూస్తూ నవ్వాడు. సుశీలకూడా సిగ్గు-సిగ్గుగా నవ్వింది.

"రమణా!...నిన్ను చాలా బాధపెట్టాను. పాపిష్ఠిదాన్ని. అందుకే యీ బాధ అనుభవిస్తున్నా. కర్మ పరిపక్వం అయింది. నీగురించి ఎలాంటి సంగతి తెలియదు. మాయింటికోమాటు రా...మీఅమ్మ కులాసాగా వుందా?"

ఈ మాట కతను బాధగా నవ్వుతూ 'మా అమ్మపోయి ఏడాది దాటింది - టైఫాయిడ్ వచ్చింది.' అన్నాడు.

ఆర్. యం. చిదంబరం

"అయ్యో!...మహా యిల్లాలు-దాని వుసురు తగలకుండా వుంటుందీ! ఒకనాడు మహారాజులం-మరోనాడు భిక్షాధికారులం..." ఆవిడ కొంతసేపు కంట తడిబెట్టుకుంది. తన ఇంటిగుర్తులు చెప్పింది. 'రేపు తప్పకుండా రావాలా!...సెలవు రోజేగా!' అంది సుశీల-అతను సరేనని బయటకొచ్చాడు.

అత్తయ్యతత్వం ఇలా విభిన్నంగా మారటానికి, ఆమెలో నిజంగా కలిగిన పశ్చాత్తాపంకంటె పరిస్థితుల ప్రభావమే అనుకుంటూ, ఆమె పట్నం ఎందుకు వచ్చిందీ అడుగుదామనుకుంటూనే మర్చిపోయాడు. అతని ఆలోచనలు వెనక్కి పరుగెత్తాయి.

అతను శ్రీమంతుడు కాకపోయినా దరిద్రుడు కాడు. తండ్రికి బ్యాంకులో వుద్యోగంవుంది. జీతం బాగావస్తుంది. గారాబంగా పెరిగాడు. సిల్కు బట్టలు వేసుకోకపోయినా చిరుగుబట్టలు వేసుకోలేదు. ప్రతిరోజూ పంచభక్ష్యపరమాన్నాలతో భుజించకపోయినా తృప్తిగా తినేవారు. ప్రతివారి జీవితంలోనూ ఎప్పుడో ఒకప్పుడు కష్టదశ ప్రవేశిస్తుంది. సహనాన్ని పరీక్షిస్తుంది. రవణకది బాల్యదశలోనే ఆరంభమైంది.

నాన్న పనిచేస్తున్న బ్యాంక్ హఠాత్తుగా దివాలా తీసింది. బ్యాంక్ మూలధనాన్ని చిత్తంవచ్చినట్టు నష్టపరచినందుకు డైరెక్టర్లందరూ కటకటాల వెనక్కి చేరుకున్నారు. మూడుపువ్వులు — ఆరు కాయలుగా గడచిపోతున్న సంసారం నడిసముద్రంలోపడ్డ నావలాగైంది. రవణ తండ్రికి నెల రోజులు తిరిగినా వుద్యోగం దొరకలేదు. మానసికాందోళన ఎక్కువైంది. రవణ అప్పట్లో పరిస్థితుల్ని అర్థంచేసుకునే మానసిక పరిపూర్ణత పొందకపోవటం వలన అమ్మ నెయ్యివడ్డించటం మానేసరికి మారాంసాగించాడు. రోజూ ఏదో తినుబండారాల్ని తీసుకువచ్చే నాన్న వుత్తచేతుల్తో రాగానే చాలాకోపం వచ్చేది. పైపెచ్చు తండ్రి తన్ను చూసి కంట తడిబెడుతున్నాడు కూడా!

నెలరోజులయాక నలభైరూపాయల వుద్యోగం దొరికింది. కాని మనస్సులో బాధ ఎక్కువైంది. ఇంటికాలస్యంగా వచ్చేవాడు. అమ్మకూడా పొదుపరితనం అలవర్చుకుంది. చివరికి పరధ్యానంగా రోడ్డుమీద నడుస్తూ ప్రమాదానికి గురై నాన్న కన్నుమూశాడు.

కష్టాల వుచ్చు బాగా బిగిసింది. పూర్తిగా బిగిస్తే ఏ బాధా వుండదు. కాని సందిగ్ధావస్థలో వుంచింది. రవణ తండ్రి దగ్గర వొక్కటే లోపం వుండేది. ఎవరేదడిగినా లేదనకుండా ఇచ్చేవాడు. తన శక్తికూడా గమనించడు. ప్రతిరోజూ ఎవరో అతిథులు తిని లేచేవారు. ఆయనకు డబ్బు బాకీ వున్నవాళ్లు చాలామంది. అప్పులు నోటిమాటమీద యిచ్చినవికాని నోట్లమీద కాదు.

అందరూ సానుభూతి తెలియజేశారు. తనకు ఇంగితజ్ఞానం కలిగిన తరువాత అప్పుడే అతను అత్తయ్యను మొదటిసారిగా చూడటం. నాన్నకూ మామయ్యకూ మనస్పర్థలుండటం వలన రాకపోకలుండేవి కావు. మొదట్లో అతనికి భయంవేసింది. మొహంనిండా స్ఫోటకం మచ్చలు! ఎత్తుపళ్లు కొంచెం ఇంచుమించు కోరల్లా వుండేవి. సినిమాల్లో చూసిన రాక్షసులతో ఆమెను పోల్చుకోటానికి ప్రయత్నించేవాడు.

ఓ నెలరోజులు గడిచాక అతను అమ్మతో మామయ్యింటికి వచ్చేశాడు. అతని కిదివరకున్న స్వేచ్ఛ [illegible] వుండేదికాదు. మామయ్య కొడుకు అతనితో ఎప్పుడూ కలిసేవాడు కాడు. రవణను ఏడిపించటం అతని ముఖ్య కార్యక్రమాల్లో వొకటి. మామయ్య కూతురు సుశీల అమితగర్విష్ఠి. అతని హృదయానికి దగ్గరగా వచ్చినవారెవరూ లేరు. సుశీలా - అతనూ వొకే తరగతిలో చదువుతూండటంవలన అతనికి క్లాసులో రెండో మూడో పడితే ఆ వార్త రాగానే ఇంటిల్లిపాదికీ ప్రకటించి ఆనందపడేది. ఆమె తత్వం అలాంటిది. రవణ, అతనితల్లీ తినటానికి గతిలేక తమ యింటిమీద పడ్డారనే అభిప్రాయాన్ని అత్తయ్య సుశీల హృదయంలో నాటింది.

అటు అత్తయ్య చిల్లరపనులన్నీ అతనిచేత చేయించేది. ఆమె వంటింటికి స్వస్తిచెప్పటం-అమ్మ నడుం విరిగేటట్టు చాకిరీచేయటం జరుగుతూ వచ్చింది. మామయ్యకు లక్షన్నర వ్యవహారాలుండటంవలన అతనెప్పుడూ ఇంటోవుండేవాడుకాడు. ఎట్లాగైనా కొడుకు చదువు పూర్తవుతే చాలని తల్లి అభిప్రాయం.

పుండుమీద కారంజల్లినట్టు మావయ్య హఠాత్తుగా గుండె ఆగి చనిపోయాడు. నీట్లో మునిగి పోకుండా మర్రివూడ ఆధారంగా దొరికితే అది కూడా జారిపోయింది. అత్తయ్య ఇల్లమ్మేసి పిల్లల్తో పుట్టింటికి దారితీసింది. అమ్మ చేన్ని చాపు కున్నా ఆత్మాభిమానం వదలి ఆశ్రయమిమ్మని ఆమె నడగలేకపోయింది. మావయ్య పోవటంతో అనుబంధం తెగింది. ఇంకేముహాం పెట్టుకునడుగుతుంది?

ఎంత కష్టాల్లోవున్నా భగవంతుణ్ణి నమ్ముకునే వాళ్ళకు సముద్రంలో మునిగిపోకుండా ఏదో ఒక పట్టు దొరుకుతుంది.

నాలుగిళ్ళవతలవున్న లెక్కల మేష్టారు సమయానికి ఆదుకున్నారు. ఆయనకు నలభైయేళ్ళు దాటివుంటాయి. చిరకాలంవరకూ సంతానం కలగక పోవటంమూలాన పిల్లలంటే ఆయనకు వెర్రెక్కువగా వుండేది. అసహాజ తత్వంవలన తనవిద్యార్థుల్ని సహితం క్షమించి దండించకుండా వొదిలేశేవాడు. చివరకాయనకు ముప్పైరెండోయేట ఆడపిల్ల కలిగినా ఆ మక్కువ వదల్లేదు. రవణ క్లాసులో ఫస్టుగా వుండటం ఆయన గమనిస్తూనే వున్నాడు. 'మీరేం అధైర్యపడకండి, ఇప్పుడితన్నిలా చదివించకుండా సందిగ్ధంగా వొదిలేస్తే కాఫీ హోటలు సర్వరుగానో - బస్సు కండక్టరుగానో వెళ్ళవలసి వస్తుంది. స్కాలర్‌షిప్పు దొరుకుతుంది. ఇంక నేనే మీ అన్నయ్యననుకోండి. రండి-మా యింట్లో వుందురుకాని-మీరు సంకోచిస్తే అతని జీవితం నాశనంచేసినవారవుతారు-పోనీ-మార్గాంతరంవుంటే ఆలోచించండి - కుర్రాడు బుద్ధిమంతుడు.' అన్నాడాయన. అమ్మకు 'నా' అనేవాళ్లులేరు. ఇంక గత్యంతరమేముంది?

ఎప్పుడు దాచిందో-ఎలా పోగుచేసిందో-అమ్మ దగ్గర అయిదువందలపై చిలుకుడబ్బుంటే అదాయనకిచ్చింది. మేష్టారి భార్యకూడా మంచిది కావటంమూలాన ఘర్షణలు లేకపోయాయి. అమ్మ అక్కడక్కడ పనిచేసేది. మేష్టారు వద్దని వారించేవారుకాని అభిమానాన్ని పూర్తిగా చంపుకోలేని అమ్మకు ఆయన పోషణలో వుండటం బాధగానే వుంది.

రోజులు దొర్లిపోయాయి. రవణకు చదువు తప్పించి మరేలోకమూ లేదు. మేష్టారు ముందు జాగ్రత్త వున్నవారుకనక అతను ఫిఫ్తుఫారంలోకి రాగానే టైపుషార్టుహాండు నేర్పించారు. ఆయన అమ్మాయి రవణకంటే రెండు తరగతులు కింద వుండేది. వాళ్ళిద్దరూ కలిసి మెలిసి వుండటాన్ని ఆయనెన్నడూ వారించలేదు. ఆయన మనస్సులో వుండే అభిప్రాయాన్ని నలుగురూ నాలుగు రకాలుగా వ్యాఖ్యానించారు. ఒకందుకుమాత్రం మేష్టారు సంఘానికి నమస్కరించారు. తనమీద వరూ అపవాదు వేయనందుకు.

రవణ స్కూలుఫైనలు ఫస్టుక్లాసులో ప్యాసయ్యాడు. టైపురైటింగ్ - షార్టుహాండు బాగా తెలియటంవలన అతనికి మంచివుద్యోగం దొరికింది. అమ్మను తీసుకుని పట్నం వచ్చాడు.

తల్లీ కొడుకులకున్న అభిలాష వొక్కటే-ఎలాగైనా మేష్టారి ఋణం తీర్చుకోవాలి. అది ధనరూపంగా తీరుద్దామనుకుంటే ఆయన వొప్పుకోడు. తన కొడుకుని అల్లుడిగా చేద్దామనే ఆశవుందికాని నలుగురింట్లో పనిచేసిన తను గౌరవంగా బతికిన వారితో వియ్యమెట్లా కుదుర్చుకోగలదు? ఆమాట అడగడానికూడా ఆమెకు ధైర్యంలేకపోయింది. ఈ సమస్యను సాధించటమెలాగన్న ఆలోచనతోనే రోజులు - నెలలూ దొర్లిపోయాయి. తరవాత మేష్టారు ఆవూరువిడిచి వెళ్ళిపోయారు. ఎక్కడకు వెళ్ళిందీ రవణకు తెలియదు. స్కూలుఫైనలు పరీక్ష ఫీజు కట్టటానికి సమయానికాయన దగ్గర డబ్బులేకపోయింది. తన వేలుకున్న వుంగరం అమ్మేసి తనకు డబ్బిచ్చాడు. ఈ విషయం ఆయన వూరు విడిచిపెట్టాక కాని తెలియలేదు. ఆయన హృదయపు విశాలత్వాన్ని కొలవటం ఎవరితరమూ కాదనుకున్నాడు.

నడుస్తున్న రవణ తిరిగి యీ లోకంలోపడ్డాడు. అతను చాలా కాలంనుంచి మేష్టారిజాడ తెలుసుకోటానికి ప్రయత్నించాడుకాని అత్తయ్య గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. ఆలోచించవలసిన అవసరమూ కనిపించలేదు.

రవణ మర్నాడుదయం వెతుక్కుంటూ అత్తయ్యిల్లు చేరుకున్నాడు. అది చిన్నవాటా-చుట్టూ మురికినీరు-అక్కడ వాళ్లెలావుండగలుగుతున్నారో

అతనికర్థంకాలేదు. సుశీల కాఫీ తీసుకొచ్చి అతని ముందు వుంచింది. ఎందుకో సుశీల నిన్నటికంటె అందంగా కనిపించింది. తల స్నానం చేసింది గామోలు - వదలుగా ముడివేసుకుంది. అత్తయ్య తన కథంతా చెప్పుకుపోయింది. కొంతకాలం తనూ వైభవంగా బతికిందని-తన పుట్టింటూరు ధనవంతులు కాకపోవటంవలన - చివరికి కొడుకును స్కూలు ఫైనలు పూర్తి చేయించటమే తలకు మించిన బరువైందట. అదైనా మూడోసారి-ప్రస్తుతం అతను తాలూకాఫీసులో గుమాస్తాగా వుంటున్నాడు.

"అంతా జరిగిపోయింది. ఇాకెందుకు? ఇంక సుశీల పెళ్ళిచెయ్యాలి. అదే ఇప్పుడు సమస్య. ఈ సమస్యను సాధించటానికి మానవాతీతమైన శక్తే కావాలి. నాకు మతిపోతోందనుకో" అన్నాడు అత్తయ్యకొడుకు. రవణ అయిదు నిమిషాలు ఏదో ఆలోచిస్తూ వుండిపోయాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

"ఆ...ఏంలేదు. మావయ్య వున్నప్పటిరోజులు జ్ఞాపకం వొస్తున్నాయి." అతను రవణ చేతులు ఛటుక్కున పట్టుకున్నాడు.

"అప్పుడు నిన్ను అందరం పీక్కుతిన్నాం. నన్ను క్షమించు-సుశీల పెళ్ళివిషయంలో నువ్వు తప్పించి మాకు సాయంచేసే వారెవరూ లేరు." సుశీల గుమ్మం దగ్గర నిలబడి అతనికేసి వారగా చూస్తోంది. పరిస్థితుల్ని అవగాహన చేసుకోటాని కతనికి అట్టే కాలం పట్టలేదు.

"అవున్నాయనా! ... పీడికేం తెలియదు. అయినా మన బాధ్యత్వ మెక్కడికి పోతుంది? దాని భారమంతా నీదే!"

అత్తయ్య చమత్కారానికి అతను నవ్వకో కుండా వుండలేకపోయాడు. ఎంత డొంక తిరుగుడుగా చెప్పినా ఆమె మనసులోవున్న అభిప్రాయం తను సుశీలను చేసుకోవాలని...ఆ మాట తల్చుకుంటేనే అతనికి భయంగావుంది. అయినా తను రుణపడివున్నది మేష్టారుకి కాని ఈమెకాదు.

"నువ్వు శీతకన్ను వేస్తే దాన్ని ఏ ముసిలాడికో యిచ్చి మా బరువు వదిలించుకోవాలి. దాని జీవితం కూడా ఎందుకూ కొరగాకుండా పోతుంది." అందత్తయ్య.

"నాకు చేతనైనంతవరకూ ప్రయత్నిస్తానండి. అన్నింటికీ దేవుడున్నాడు" అని రవణ అనేసరికి ఆమె ముహం క్రమంగా పాలిపోయింది. కళ్ళల్లో కొన వూపిరిలా మిగిలివున్న ఆశ అంతర్థానమైంది.

"వస్తాన"ని అతను బయటపడ్డాడు. పదడుగులు నడిచేసరికి ఎదురుగా మేష్టారు కూరల సంచీ పట్టుకువస్తారు. అతను విస్తుపోయి చూస్తుంటే ఆయనే నవ్వుతూ బుజంమీద చెయ్యివేసి కదిలిస్తూ-

"ఏం! బాగున్నావా రవణా!" అన్నారు.

"మేష్టారూ! మీరిక్కడే వుంటున్నారా?"

"ఆ...వచ్చి పదిహేను రోజులవుతుంది. మన వూరు వదిలాక నాలుగైదు చోట్లు మారాను. ఆఖరు కిక్కడ స్థిరనివాసం ఏర్పరచుకుని ప్రశాంతంగా వుండాలనే అభిలాష. రోడ్డుమీదేమిటి? ఇంటికి పోదాంపద. మీ అత్తయ్యక్కడేవుంది. చూశావా?"

రవణంతా వివరించాడు.

"పాపం!...సుశీల పెళ్ళికోసం పడరాని బాధలు పడుతూంది - కాలం కర్మం కలిసిరాలేదు. ఇాక మంచి రోజులు ఆరంభమయ్యాయనుకుంటా! మేష్టారి నవ్వుమాటలు అతనికేమీ అర్థంకాలేదు.

మేష్టారి భార్యకూడా అతన్నిచూసి సంతోషించింది. కుశలప్రశ్నలు వేసింది. తల్లిపోయిందన్న వార్తవిని బాధపడింది. రవణ చాలాసేపట్నుంచి అణచి వుంచిన ప్రశ్న అడిగేశాడు:

"మీ అమ్మాయేదండి?"

"నీకు చెబుదామనుకుంటున్నా-ఇంతలో నువ్వే అడిగేశావు. దానికి పెళ్ళయి అప్పుడే నాలుగు నెల్లవుతుంది. నీకు శుభలేఖ కూడా పంపినట్టు జ్ఞాపకం - అంతా హడావుడిగా జరిగిందనుకో... మరోసంగతి దాన్ని రెండో పెళ్ళి వాడికిచ్చానోయ్ మా ఆవిడకది నచ్చలేదు. కాని ఏంచేస్తాను? నాకేమో వయసు ముంచుకొస్తోంది. ఓపిక తగ్గింది. బడిపంతులుగా వుంటూ ఎవడూ దమ్మిడీ కూడా మిగల్చ లేదని నీకు తెలుసుగా-చివరకు ప్రావిడెంటు ఫండు వస్తుందనుకో-దాంతో పెళ్ళి పూర్తి చేస్తే మరి మాకు వృద్ధాప్యంలో చిప్పే మిగులుతుంది. ఇంత చాకిరీ చేసి చివరకు ఆఖరి ఘడియల్లోనైనా సుఖంగా వుండక్కర్లేదంటావా?" రవణ కుద్రేకం పొంగుకొచ్చింది. ఏదో అనాలని

ప్రయత్నించి విఫలుడయ్యాడు. మేష్టారో మాటు అతనివంక చూసి చెప్పుకుపోయారు.

"నాకు స్వార్థం ఎక్కువంటావు-అంతేనా? మనిషన్నాక కొద్దో గొప్ప స్వార్థంవుండాలి. అదీ కాక ఇప్పుడు దానికి వచ్చిన లోటేమీ లేదు. శ్రీమంతుల యింట పుట్టలేదు కనక తాలూకాఫీసు గుమాస్తా పెళ్ళాం అయింది. అంతే"

"మేష్టారూ!...మీ కెప్పుడూ ప్రత్యుపకారం చేయాలనేవుంది నాకు. నేనంత కృతఘ్నుణ్ణి కాను. ఆ రెండో పెళ్ళివాడికంటె నేను మీకు నయమని పించలేదా?"

ఈ మాటకు మేష్టారు కొంతసేపు ఆశ్చర్యంగా చూసి "అలాగా! నీకలాంటి అభిప్రాయంవున్నట్టు నాకు తెలియదు. అయినా నువ్వు కుర్రాడవి. మీ అమ్మాయినా ఆ విషయం నాలో కదలించలేదు- పోనీలే—అంతా అయిపోయింది. దైవఘటన—" అన్నాడాయన మేష్టారిభార్య అతనిముందు కాఫీ వుంచింది.

"ఏదో ఋణం తీర్చుకోటం అంటున్నావే? నీకో సలహా యిస్తాను. అనుసరిస్తావా?"

"మీరేం చేయమన్నా చేస్తాను."

"పాపం! మా సుశీలగతి చూడు. మొన్న దానికో సంబంధం వచ్చింది. ఆ వరుడికి యాభై యేళ్ళుంటాయి. డబ్బుంది కనక మీ అత్తయ్య సిద్ధపడింది. సుశీల నా దగ్గర కన్నీరుమున్నీరుగా ఏడ్చిపోయింది. ఆ అమ్మాయి జీవితం నాశనం కాకుండా నువ్వెందుకు పెళ్ళి చేసుకోకూడదు? గతంలో మీ అత్తయ్య నీ యెడకరకుగా ప్రవర్తించిందేమో కాని సుశీల చేసిన అపరాధం ఏమిటి?— అదీకాక ఆ అమ్మాయిలో తిరస్కరించదగ్గ లోపా లేవిటి? అందుచేత నామీద నీకు గౌరవంవుంటే సుశీలను పెళ్ళి చేసుకుని సుఖపెట్టు."

రవణ మాట్లాడలేదు. ఆలోచలో పడ్డాడు.

సుశీల పరుగెత్తుకొచ్చింది.

"మేష్టారూ!...అన్నయ్య — అమ్మ - నన్ను మొన్న వచ్చిన ఆసామికి ఇవ్వటానికి నిశ్చయించారు. ఇవేళే వుత్తరాలు రాస్తారట—తమకు సమ్మతమేనని..."

మేష్టారు సార్థకంగా రవణకేసి చూశారు.

"ఎవరా కొత్త ఆసామి?... ఈ అమ్మాయికి దేవుడు నిర్ణయించిన వరుణ్ణివుండగా మధ్య పానకంలో పుడకలా వీడెవడు! మీ అమ్మతో చెప్తాను." అంటూ సుశీలకేసి చూసి నవ్వాడు రవణ.

సుశీలకళ్ళు నీటితో నిండాయి.

ఆ కళ్ళతోనే మేష్టారివంక కృతజ్ఞతగా చూసింది. ★

---

(19-వ పేజీ తరువాయి)

దీక్షితులుగారు యీమెని ఒక నాయిక కావా అని సృష్టించారా? అందునా, ఆధునిక నాయిక అంటే యిలాగే వుండాలా? అన్న ప్రశ్నలకి దీక్షితులుగారి యితర రచనల దృష్ట్యా చూస్తే సులభంగా సమాధానాలు దొరుకుతాయి. దీక్షితులుగారి దృష్టిలో కూడా వటీరావు మహా నాయిక కాదు. వింతసృష్టిమాత్రమే. ఏ కాలంలో నైనా ఏ నాగరికతతో నైనా విపరీతపు పోకడలకి దారి తీసే అవకాశాలు వుంటాయి. కాని అటువంటి వాటినే పట్టుకుని-యివీ యీ నాగరికతా చిహ్నాలు అని ఉదహరించరు. అని ప్రకృతిలో కానవచ్చే వైపరీత్యాల లాంటివి. వటీరావూ అంతే.

వటీరావు అతి అసహజమైన పాత్ర. ఆవిడ బ్రతికిన వాతావరణమూ అలాంటిదే. నాగరికత వ్యామోహంలో పడి యిలా తయారవుతారేమో, అలా తయారు కాకండి - అన్నదే నీతి. మనం వటీరావు కథలు యీ దృష్టితో చదవాలేకాని ఓ మహా నాయికని గురించీ, ఆధునిక వనితా వర్గానికి ప్రతినిధిని గురించి చదవబోతున్నాం అన్న దృష్టితో కాదు. అసహజంగానూ కూడా సృష్టింపబడ్డ యీ పాత్ర నాయిక ఏమిటి? అది దుష్టనాయిక కానివ్వండి - నాయిక మాత్రం కాదు. ఆధునిక నాయిక అంటే అమ్మాయిలంటే వటీరావులేనన్న దృక్పథంతో కాకుండా ప్రయత్నిస్తే నిజమైన నాయికలు కనిపించకపోరు. నే మొదట్లో చెప్పినట్టే-నిండుగా పండిన చేనుకి దిష్టిరాకుండా కట్టిన దిష్టిబొమ్మకీ- వటీరావుకీ భేదంలేదు. ఇద్దరిదీ ఒకటే పని. అవాంఛితులను దూరంగా పెట్టడం. అవాంఛిత వాతావరణంలో పడిపోకుండా హెచ్చరించడం.